సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



వేతనోత్సాహం

జీఆర్‌ఏయూలో వేతనోత్సాహం కనిపిస్తోంది. జీఓ 110 అమల్లోకి వచ్చింది.

- 8లో



మత్స్యకారుడు మృత్యువాత

సముద్రంలో బోటు బోల్తా పడి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. జగన్నాథపురం తీరంలో విషాదం జరిగింది.

- 8లో

గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్

కాశీబుగ్గ: పలాస రైల్వే స్టేషన్ పరిధిలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ ఆధ్వర్యంలో స్టేషన్‌లోని ట్రైన్లలో గంజాయి వంటి మత్తు పదార్థాల కోసం తనిఖీలు నిర్వహించారు. రెండు డిపార్ట్‌మెంట్ల సిబ్బంది పాల్గొన్నారు.



జలుమూరు: ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకువస్తున్న అర్చకులు

మధుకేశ్వరా..

మురిసె వంశధార

మధుకేశ్వరుని రాకతో వంశధార మనోహరమైంది. దేవేరితో కలిసి వచ్చిన ఈశుడిని మనసారా అభిషేకించింది. శుద్ధ పాఢ్యమి పవిత్ర ఘడియల్లో స్వామిని ఆహ్వానించి అర్చించుకుంది. శ్రీముఖలింగంలో త్రిశూల చక్రతీర్థ స్నానాల క్రతువు అంగరంగ వైభవంగా జరిగింది. నంది వాహనంపై ఊరేగుతూ నదికి వచ్చిన స్వామిని వేల మంది భక్తులు తిలకించి పులకించారు.





జన సంద్రం నడుమ వంశధారలో ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం (ఇన్‌సెట్‌లో) నందివాహనంపై పార్వతీపరమేశ్వరులు

- వైభవంగా ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం
- వంశధారకు పోటెత్తిన భక్తజనం

జలుమూరు, ఎల్‌ఎన్ పేట: ప్రఖ్యాత శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు సోమవారం స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానాలు వైభవోపేతంగా జరిగాయి. ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారు. శుద్ధపాఢ్యమి ఘడియలు మధ్యాహ్నం 1.45కు ప్రారంభం కాగా.. అదే సమయంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అర్చకులు, సర్పంచ్ సతీష్ కుమార్, జనార్ధనరావు పంచాది ప్రభాకరరావు, నాయుడు గారి రాజశేఖర్ గర్భగుడి నుంచి మంగళవాయిద్యాల నడుమ బయటకు తీసుకువచ్చారు. అనంతరం శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి, దేవదాయ శాఖ ఏసీ సూర్యప్రకాష్, డీఎస్పీ శివరామి రెడ్డి టెంకాయలు కొట్టి నంది వాహనంపై మూర్తులను ఉంచి తిరువీధి ప్రారంభించారు. అప్పటికే ఆలయం నలుచెరగులా వేల సంఖ్యలో భక్తజనం వేచి ఉన్నారు. సంప్రదాయం ప్రకారం మిరియాపల్లి రేవుకు స్వామిని తీసుకువెళ్లారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో భక్తుల దర్శనాలు సులభమయ్యాయి. రేవులో కూడా పక్కాగా ఏర్పాట్లు చేయడంతో సజావుగా క్రతువు జరిగింది. చక్రతీర్థ స్నానాలు ముగిశాక మిరియాపల్లి గ్రామస్తులు ఇచ్చిన నూతన వస్త్రాలు, పండ్లు, టెంకాయలతో స్వామికి ప్రత్యేకంగా పూజలు చేశారు. పార్వతీదేవిని మిరియాపల్లి ఆడపడుచుగా భావించి నూతన వస్త్రాలు పెడుతుంటారు. అక్కడ పూజలయ్యాక మళ్లీ నంది వాహనంపైనే ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు పైడి శెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం అందించారు. అలాగే నగిరికటకం, మెట్టపేట యువత, గ్రామ పెద్దలు భక్తులకు అన్నదానం, మజ్జిగ అందించారు.

కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, వైస్ చైర్మన్ లాడి రమేష్ గుప్తా, పాలక వర్గం సభ్యురాలు పి.ధనలక్ష్మీ, తహసీల్దార్ బి.సత్యం, పంచాయతీ విస్తరణాధికారి ఈశ్వరరావు, ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు దండం పెట్టుకుంటున్న చిన్నారులు

న్యూస్‌రీల్

ఉగాదికి 18,817 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు



మాట్లాడుతున్న ఈఈ మోహనరావు

నరసన్నపేట: శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఈ ఉగాదికి 18,817 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ ఈఈ పీజే మోహనరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహనిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ డివిజన్‌లో 43,149 ఇళ్లు మంజూరు కాగా 39,005 ఇళ్ల పనులు ప్రారంభించారని, వీటిలో 12,080 ఇళ్లు పూర్తయ్యాయని, లక్ష్యం ప్రకారం మిగిలిన 6,737 ఇళ్లు ఉగాది నాటికి పూర్తి చేస్తామన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక అక్రమ రవాణాతో సీజ్ చేసిన ట్రాక్టర్లు

మందస: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ వై.రవికుమార్ చెప్పారు. గౌడుగురంటి, తాళ్లగురంటి ప్రాంతంలోని మహేంద్రతనయ నది పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను తీసుకెళ్తున్న ఈ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. పింపిడియా గ్రామానికి చెందిన తలగాన పాపారావు, బెల్లుపటియాకు చెందిన మడియా గోవర్ధనరావు, పొత్తంగిలోని దల్లి భాస్కరరావు, కొర్రాయిగేటు నర్తు రఘునాథ్, గొల్లలపాలేనికి చెందిన నర్తు హేమరాజులకు చెందిన ఈ ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. సోంపేట కోర్టులో హాజరు పరనున్నట్టు ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు మాదిన శ్రీకర్ ఎంపిక



మాదిన శ్రీకర్

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మాదిన శ్రీకర్ ఈ నెల 22వ తేదీ నుంచి బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. దీనిపై శ్రీకర్ తండ్రి మాదిన చిరంజీవులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో శ్రీకర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిపై జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, అశోక్, సీఈఓ సూరిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకర్ జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని తల్లిదండ్రులతోపాటు, గ్రామస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

7 నుంచి ఓటీ డ్యూటీల బహిష్కరణ



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహాధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మార్చి 7వ తేదీ నుంచి ఓటీ డ్యూటీలు బహిష్కరించనున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి, ఈయూ జోనల్ కార్యదర్శి బీకే మూర్తి తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్‌లో నెలకొన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం రెండో డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత 17 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేస్తున్నా యాజమాన్య వైఖరిలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం రెండో డిపోలో సమస్యలు నెలకొన్నాయని, వీటి వలన కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చట్టసభలకు మరో బీసీ నేత



- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావు
- వైఎస్సార్‌సీపీకి మెజార్టీ ఉండటంతో ఎన్నిక లాంఛనం
- అట్టడుగు వర్గాలను రాజకీయంగా పైకి తీసుకొస్తున్న సీఎం వైఎస్ జగన్
- ఇచ్ఛాపురానికి దక్కిన మరో కీలక పదవి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లాలో మరో బీసీ నాయకుడికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టం కట్టారు. ఇచ్ఛాపురంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావును స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. అట్టడుగు వర్గాలకు చెందిన వారిని సీఎం ఒక్కొక్కరిగా రాజకీయంగా పైకి తీసుకొస్తున్నారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నిరూపిస్తూ రాజ్యాధికారాన్ని ఇస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తూనే.. పెద్దల సభలకు కూడా వారినే ఎంపిక చేస్తున్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూనే.. నాయకత్వ లక్షణాలున్న వారికి రాజ్యాధికారాన్ని అప్పగిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన సీదిరి అప్పలరాజును ఎమ్మెల్యేగా చేయడంతో పాటు మంత్రి సీటుపై కూర్చోబెట్టారు.

వెనుకబడిన వర్గాలకు పెద్దపీట

కాళింగ సామాజిక వర్గానికి చెందిన తమ్మినేని సీతారాంను ఏకంగా రాష్ట్ర శాసన సభాపతిగా నియమించారు. అదే కాళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా విజయను జెడ్పీ చైర్‌పర్సన్‌గా, దువ్వాడ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీగా చేశారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన ధర్మాన ప్రసాదరావును మంత్రిని చేశారు. అదే సామాజిక వర్గానికి చెందిన ధర్మాన కృష్ణదాస్‌కు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వగానే డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. కాపు సామాజిక వర్గానికి చెందిన పాలవలస విక్రాంత్‌ను ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఎమ్మెల్సీని చేశారు. అదే సామాజిక వర్గానికి చెందిన గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతిలకు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించారు. తాజాగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావును ఎమ్మెల్సీ చేస్తున్నారు. కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన మహిళను సుడా చైర్మన్‌గా, అదే సామాజిక వర్గానికి చెందిన అంధవరపు సూరిబాబును రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌ను చేశారు.

సామాజిక వర్గాల సమతుల్యత

ఎస్సీ, ఎస్టీ, రెడ్డిక తదితర సామాజిక వర్గాల వారికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు ఇచ్చారు. ఇలా అన్ని వర్గాలకు సంబంధించి సామాజిక సమతుల్యత పాటించారు. ఎలాంటి కుటుంబ చరిత్ర లేకపోయినా దక్షత ఉంటే సాధారణ వ్యక్తిని సైతం ఉన్నత పదవిలో కూర్చోబెట్టవచ్చని చేసి చూపించారు. తాజాగా నర్తు రామారావును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మరో కీలక పదవి ఇచ్చినట్టు అయింది.

సరికొత్త చరిత్ర

- చట్టసభలకు తొలిసారిగా యాదవ సామాజిక వర్గ నేత
- జిల్లాలో ఇప్పటివరకు ఎవరికీ దక్కని అవకాశం
- యాదవుల కోరిక నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నేత తొలిసారి చట్టసభలో అడుగు పెట్టబోతున్నారు. జిల్లా చరిత్రలో ఇదొక రికార్డు. ఆ అరుదైన అవకాశాన్ని నర్తు రామారావుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావును ఎమ్మెల్సీని చేస్తానని చెప్పినట్టుగానే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటాలో పెద్దల సభకు పంపిస్తున్నారు.

మాట ఇచ్చినట్టుగానే..

2019 ఎన్నికల సమయంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావు ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. కానీ సామాజిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఆయనకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఇచ్ఛాపురం నుంచి పిరియా సాయిరాజ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని, ఆయన్ని గెలిపించుకోవాలని, అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి ఇస్తామని నర్తు రామారావుకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోయాయి. అక్కడ పార్టీ అభ్యర్థి సాయిరాజ్ గెలవకపోయినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా రాజకీయ హామీలు కూడా సీఎం వైఎస్ జగన్ నెరవేర్చుతున్నారు. కాకపోతే రాజకీయ ప్రాధాన్యతల దృష్ట్యా తొలి విడతలో దువ్వాడ శ్రీనివాస్‌కు, రెండో విడతలో పాలవలస విక్రాంత్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఈలోగా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో నర్తు రామారావుకు రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. తాజాగా అప్పటి హామీని నిలబెట్టుకుంటూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీల బలాబలాల ప్రకారం నర్తు ఎన్నిక లాంఛనమే.

పేరు: నర్తు రామారావు
పుట్టిన తేదీ : 17-05-57
కులం : యాదవ సామాజిక వర్గం(బీసీ–డీ)
ప్రస్తుత పదవి: ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్.
స్వగ్రామం: కొత్తపుట్టుగ, శిలగాం(పోస్ట్), కవిటి మండలం.
విద్యార్హతలు: 9వ తరగతి
భార్య: నర్తు చామంతి(45), మాజీ ఎంపీపీ, కవిటి.
సంతానం: ఎన్.శివాజీ(28), బీటెక్, వ్యాపారం, వ్యవసాయం చేస్తుంటారు.ఎన్. రవికుమార్(25), ఆస్ట్రేలియాలో ఎం.ఎస్.సి. పూర్తిచేసి, విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కె.పద్మ ప్రకాష్(32), ప్రస్తుత కవిటి మండలం ఎంపీపీ.
అల్లుడు: కడియాల ప్రకాశ్(44), విద్యార్హత బీఏ డిగ్రీ, 20 ఏళ్లుగా మామ నర్తు రామారావుకు రాజకీయంగా వెన్నుదన్నుగా ఉంటున్నారు.

యాదవ సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత

గత టీడీపీ ప్రభుత్వంలో యాదవులను ఓటు బ్యాంక్‌గా వాడుకోవడం తప్ప చేసిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక యాదవులకు రాజకీయంగా సముచిత స్థానం దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నేతలను ఎమ్మెల్యేలుగా చేయడమే కాకుండా మంత్రి పదవులు కూడా ఇచ్చారు. విశాఖ సిటీకి చెందిన వంశీకృష్ణ యాదవ్‌ను ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడదే సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావును ఎమ్మెల్సీ చేస్తున్నారు.


సిక్కోలు చరిత్రలో తొలిసారి

జిల్లాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులెవరూ ఇంతవరకు చట్ట సభలకు వెళ్లలేదు. గతంలో నర్తు రామారావు రెండుసార్లు పోటీ చేసినా గెలవలేదు. దీంతో యాదవుల ఆశలు నెరవేరలేదు. ఎట్టకేలకు సీఎం వైఎస్ జగన్ చొరవతో నర్తు రామారావు పెద్దల సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నిర్ణయం జిల్లా చరిత్రలో నిలిచిపోనుంది.

నర్తు కల సాకారం

చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాలని నర్తు రామారావు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రామారావు కవిటి మండలం బెలగాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా రాజకీయ కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత లండారిపుట్టుగ సర్పంచ్‌గా రెండు సార్లు పనిచేశారు. కాంగ్రెస్‌లో జిల్లా నాయకుడిగా, రాష్ట్ర కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా ప నిచేశారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2009 ఎన్నిక ల్లో ఇచ్ఛాపురం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కూడా పోటీ చేసి అపజయం పాలయ్యారు. 2019 లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. కానీ పార్టీ రాజకీయ, సామాజిక సమీకరణాల దృష్ట్యా పోటీకి దూరంగా ఉండాల్సి ఉంది. అప్పట్లోనే ఎమ్మెల్సీగా చట్టసభలకు పంపిస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకున్నారు. దీంతో ఎట్టకేలకు నర్తు కల సాకారమైనట్టు అయింది.

సామాజిక న్యాయానికి పెద్దపీట



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక సమతూకాన్ని మరోసారి పాటించారని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీల అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందనేది నిరూపించారని పేర్కొంటూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల కోటాలో జిల్లాకు చెందిన నర్తు రామారావును ఎంపిక చేయడంపై యాదవ సామాజిక వర్గానికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు అయిందని తెలిపారు. బీసీలంతా ముఖ్యమంత్రి రుణపడి ఉంటారని తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు




సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

కవిటి, కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఏపీ గ్రీనింగ్‌అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు సోమవారం విజయవాడలోని సీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని నర్తు రామారావు అన్నారు.

స్పందనలో 135 అర్జీల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ బి.నవ్య అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న పైడి లక్ష్మి తనకు మరణించేందుకు అనుమతి ఇవ్వాలని, వేధింపులు భరించలేకపోతున్నానని ఫిర్యాదు చేశారు. బీసీ సంక్షేమాధికారి తనను వేధిస్తున్నారని ఆరోపించారు.దీనికి స్పందించిన కలెక్టర్ వెంటనే పోస్టింగ్‌ను శ్రీకాకుళం నగరంలో ఇవ్వాలని బీసీ సంక్షేమాధికారిని ఆదేశించారు. అన్ని శాఖలకు కలిపి 135 అర్జీలు వచ్చాయి. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.


'సీఎంకు రుణపడి ఉంటాం'



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదవ సంఘ నాయకులు

టెక్కలి: యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని టెక్కలి నియోజకవర్గం యాదవ సంఘం నాయకులు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన నర్తు రామారావును స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో కృతజ్ఞతగా సోమవారం టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో యాదవ సంఘం నాయకులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రసిద్ధ తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం యాదవులకు ప్రత్యేక స్థానం ఇచ్చారని తెలిపారు. నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించే విషయంలో కృషి చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, జెడ్పీ చైర్మన్ పిరియా విజయమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'సీఎం వైఎస్ జగన్‌దే ఆ ఘనత'



గద్దిబోయిన కృష్ణయాదవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో యాదవులను తొలిసారిగా చట్టసభలకు పంపుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ అన్నారు. నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం యాదవ కులానికే గర్వకారణమని అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా టీడీపీ యాదవుల ఓట్లు దండుకుని వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమసమాజ స్థాపన కోసం వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని, యాదవులమంతా జీవితకాలం వైఎస్ జగన్ వెంటే ఉంటామని తెలిపారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రజని

పొందూరు: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ శ్రీకాకుళం సబ్ డివిజన్ ఏడీఏ బి.రజని హెచ్చరించారు. సోమవారం పొందూరులో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ ఎరువులు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా లైసెన్సులు రద్దు చేస్తామని చెప్పారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జి పాల్గొన్నారు.

బాలలను పనిలో పెడితే చర్యలు



బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న ఏహెచ్‌టీయూ బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: బాలలను పనిలో పెట్టుకోవద్దని ఏహెచ్‌టీయూ ఎస్సై ఎల్.వెంకటరావు అన్నారు. ఏహెచ్‌టీయూ బృందం సోమవారం కుశాలపురంలోని నవభారత్ పారిశ్రామికవాడను సందర్శించింది. పరిశ్రమల్లో కార్మికుల వయసుపై ఆరా తీశారు. అనంతరం ముద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సదస్సు నిర్వహించి మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థలపై అవగాహన కల్పించారు. ప్రజా చైతన్యంతోనే బాల కార్మిక వ్యవస్థకు ముగింపు సాధ్యమవుతుందని చెప్పారు. బడి ఈడు పిల్లలను చదివించాలని, బాల్య వివాహాలు చేయవద్దని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా చైల్డ్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై రమణమూర్తి, చైల్డ్ లైన్ సిబ్బంది డి.రాజు, మౌనిక పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో అర్హత, ఆసక్తి గల యువతకు ఫిబ్రవరి నెలాఖరు నుంచి డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ శ్రీకాకుళం హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటికే 11 బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తయ్యాయని, 12వ బ్యాచ్ ఈ నెల చివరి వారంలో ప్రారంభమవుతుందని చెప్పారు. శిక్షణలో మెలకువలతో పాటు మెకానికల్ వర్క్, యోగా, ఫస్ట్ ఎయిడ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9963091999, 7382921920 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

అంబేడ్కర్ వర్సిటీలో..

వేతనోత్సాహం

- అమల్లోకి వచ్చిన జీఓ 110
- యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం చెల్లింపు
- 76 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లలో 42 మందికి లబ్ధి



ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో వేతన ఉత్సాహం కనిపిస్తోంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, జాతీయ సాంకేతిక విద్యా మండలి, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల మేరకు వేతనాలు పెంచారు. జీఓ 110 ప్రకారం యూజీసీ నెట్/సెట్/పీహెచ్‌డీ వంటి అర్హతలు కలిగిన వారికి తాజాగా జీతాలు పెరిగాయి. మొత్తం 76 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గాను 42 మందికి లబ్ధిచేకూరుతోంది. మిగిలిన వారికి కూడా వేతనాలు పెంచే విషయాన్ని వర్సిటీ అధికారులు పరిశీలిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కాంట్రాక్టు బోధన సిబ్బందిపైనా ఎక్కువగా ఆధారపడి ముందుకు సాగుతోంది. విశ్వ విద్యాలయంలో 21 కోర్సులు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల మేరకు ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ప్రస్తుతం వర్సిటీలో రెగ్యులర్ బోధన సిబ్బంది ఏడుగురు మాత్రమే ఉన్నారు. బయోటెక్నాలజీలో నలుగురు, సోషల్ వర్కులో ఇద్దరు, ఎకనామిక్స్‌లో ఒకరు ఉన్నారు. మిగిలిన వారంతా కాంట్రాక్టు సిబ్బందే. వీరికి వేతనాలు పెంచే విషయమై వర్సిటీలో నిపుణుల కమిటీ వేశారు. ఈ కమిటీ 110 జీఓను అధ్యయం చేసి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, జాతీయ సాంకేతిక విద్యా మండలి, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధలు మేరకు వేతనాలు పెంచింది.

అర్హతలు తప్పనిసరి..

విశ్వవిద్యాలయంలో ఆర్ట్సు, లా, కామర్స్, ఇంజినీరింగ్ , ఎడ్యుకేషన్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. యూజీసీ నిబంధనల మేరకు విశ్వవిద్యాలయం బోధకునికి పీజీతో పాటు నెట్, స్లెట్, డాక్టరేట్‌ల్లో ఒక అర్హత తప్పనిసరి. ఇంజినీరింగ్‌కు సంబంధించి జాతీయ సాంకేతిక విద్యా మండలి నిబంధనలు మేరకు ఎంటెక్ విద్యార్హత చాలు. మరోవైపు విద్యా విభాగంలో పనిచేసే వారికి జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనలు మేరకు పీజీ, ఎంఈడీ ఉంటే చాలు. ఈ మేరకే వర్సిటీలో వేతనాలు ఖరారు చేశారు. విశ్వవిద్యాలయంలో అర్హతతో చేరిన వారికి ఏడాదికి వెయ్యి చొప్పును పెంచి వేతనం నిర్ణయించారు. వీరికి ఏటా రూ.1000 వేతనం పెరగనుంది. ప్రస్తుతం వర్సిటీలో 76 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా 42 మందికి జీఓ 110 ప్రకారం వేతనాలు పెరిగాయి. ఇంజినీరింగ్‌లో కొత్తగా చేరిన వారికి వేతనాలు పెంపు విషయమై అధికారులు నిబంధనలు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం వర్సిటీలో గరిష్ట వేతనం రూ.57,700 అందుతోంది. గత నెల నుంచే జీతాల పెంపు అమల్లోకి రావడంతో బోధన సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేతనం పెరిగింది..



నాకు డాక్టరేట్, నెట్ అర్హతలు ఉన్నాయి. వర్సిటీలో తెలుగు విభాగం ఏర్పాటు చేసిన నుంచి పనిచేస్తున్నాను. గతంలో రూ.37వేలు వేతనం అందేది. జీఓ 110 అమలు తరువాత రూ.51,000 అందుతోంది. మొత్తంగా రూ.14 వేలు వేతనం పెరిగింది. అర్హత గల బోధకులకు ఈ జీఓ ఉపయోగపడింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. వర్సిటీ ప్రగతికి శక్తి వంచన లేకుండా పనిచేస్తాం.

– డాక్టర్ యు.శాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం

న్యాయం జరిగింది..



నాకు గతంలో రూ.31 వేలు వేతనం అందేది. ప్రస్తుతం రూ.47 వేలు అందుతుంది. రూ.16 వేలు వేతనం పెరిగింది. డాక్టరేట్, సెట్ అర్హతలతో నేను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. గతంలో ఎన్నోసార్లు వేతనాల పెంపు కోసం అధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. ప్రస్తుత ప్రభుత్వం, వర్సిటీ అధికారులు మాకు న్యాయం చేశారు. జీఓ 110 వల్ల న్యాయం జరిగింది.

–డాక్టర్ కె.తారక రామారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, యోగా అండ్ ఫిట్‌నెస్ డిపార్ట్‌మెంట్

జీఓ 110 మేరకు..



జీఓ 110 అధ్యయనానికి కమిటీ వేశాం. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ, జాతీయ సాంకేతిక విద్య మండలి, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనలు పరిగణనలోకి తీసుకున్నాం. రూ.10 వేలు దాటి కొందరికి వేతనాలు పెగిగాయి. భవిష్యత్తులో సైతం నిబంధనల మేరకు వేతనాలు లభిస్తాయి. అర్హత ప్రామాణికంగా వేతనాలు మార్పులు అమలు చేశాం.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

టీడీపీ నేత భూఆక్రమణపై ఫిర్యాదు



టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: కోటబొమ్మాళిలో టీడీపీ మండల నాయకుడు బోయిన గోవిందరాజులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కె.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయిన కృష్ణారావు, కె.విశ్వనాథ్‌రెడ్డి, ఇర్రి చిరంజీవి, బెహరా కృష్ణ తదితరులు సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 91లో 28.38 ఎకరాలు కలిగిన పెద్ద చెరువులో బోయిన గోవిందరాజులు ఏకంగా 2.70 ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకుని రైస్ మిల్లు నిర్మించడంతో పాటు పొలాలుగా మార్చారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈయనతో పాటు మరి కొంతమంది 12 ఎకరాల వరకు చెరువు గర్భాన్ని ఆక్రమించున్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో చెరువు గర్భాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేశారని అప్పట్లో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు నాయకులు గుర్తు చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతుండగా వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్రంగా సర్వే నిర్వహించి కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని విన్నవించారు. అనంతరం సబ్ కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ భూమిని కాపాడేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

అంతర పంటల సాగుతో ఆదాయం



గొలివివానిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు 30 రకాల విత్తనాలతో పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు, సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగ జాతి పంటలు, నూనెగింజలను అంతర పంటలు సాగు చేయాలన్నారు. ఈ విధానం వల్ల భూమిలో కర్బన శాతం పెరిగి జీవన ద్రవ్యం ఏర్పడుతుందన్నారు. భూసారం పెరిగి దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది మెట్ట ధనుంజయ్, శ్రీదేవి, హరేరామ, లీడ్ ఫార్మర్ గొలివి రామకృష్ణ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని తాపీమేస్త్రి దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామారావు



లోకనాథం(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటకు చెందిన సీపాన లోకనాథం(40) సోమవారం ధవళపేటలోని అత్తవారింటికి వెళ్లాడు. ఉదయం 8 గంటల సమయంలో భవన నిర్మాణ పని కోసం ధవళపేట నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వస్తున్న ప్రైవేటు కాలేజి బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలించారు. ఆస్పత్రికి వెళ్లేసరికే లోకనాథ మృతిచెందాడు. ఇతనికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్‌ఐ సామంతుల రామారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మత్స్యకారుడు మృత్యువాత



అంబటి చిన్నారావు(ఫైల్)

రణస్థలం: మండలంలోని జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు అంబటి చిన్నారావు(48) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. స్థానికులు, మండల మత్స్యశాఖ అసిస్టెంట్ అధికారి కె.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం దుమ్ము చిన్నారావు, అంబటి అప్పన్న, అంబటి చిన్నారావులు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో తిరిగి వస్తుండగా జగన్నాథపురం తీరంలో అలల తాకిడికి తెప్ప బోల్తాపడింది. తెప్పకు ఉన్నతాడు చిన్నారావు మెడకు చుట్టుకోవడంతో మృతిచెందాడు. రిమ్స్‌లో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్నారావు భార్య అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కొట్టిందని భర్త ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్య కొట్టడమే కాకుండా కత్తితో దాడి చేసిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ ఆఫీస్ సమీపంలో కుమ్మరివీధిలో నివాసముంటున్న మెడికల్ రిప్రజెంటేటివ్ చింతనిప్పుల రాజేంద్రప్రసాద్(37) పదమూడేళ్ల కిందట పైడిరాజు అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు జన్మించారు. పైడిరాజును వివాహం చేసుకోవడం అత్తామామలకు ఇష్టం లేదని, వారి చెప్పుడు మాటలు విని భార్య తనని తరచూ తిట్టడమే కాకుండా కుమార్తెను కొడుతుండేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మహాశివరాత్రి నాడు జాగారం ఉండి ఆదివారం ఆలస్యంగా లేచిన తన కుమార్తెను భార్య కొడుతుండగా అడ్డుకున్నానని.. దీంతో కూరగాయలు కోసే కత్తితో దాడి చేసిందని చెప్పారు. ఈ ఘటనలో కుడిచేతి బొటన వేలికి గాయమైందని, బలంగా కరవడంతో వేలు, భుజాలకు కూడా తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు పేర్కొన్నారు. వెంటనే కుమార్తె సాయంతో రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు కొమ్మ

బూర్జ: మండల కేంద్రం బూర్జలో కాపు వీధి కూడలి వద్ద సోమవారం రాత్రి విద్యుత్ స్తంభం పక్కన ఉన్న మర్రి చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడింది. వైర్లు తెగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. లైన్‌మేన్ సూర్యనారాయణ వచ్చి స్థానికుల సహాయంతో కొమ్మను తొలగించారు. కొత్తగా విద్యుత్ స్తంభాన్ని వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు.



అభిమానిద్దాం.. ఆదరిద్దాం

మాతృ బాషా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం సారవకోట మండలం అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు 'అ ఆ' ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. ప్రతిఒక్కరూ మాతృ భాష పరిరక్షణకు పాటుపడాలని పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ కోరారు.

– సారవకోట

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రులు, స్థానిక సంస్థల మండలి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. మార్చి 16న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ జిల్లాల్లో మొదలైందని తెలిపారు. సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముందుగా ఓటర్ల నమోదు, తిరస్కరణలు, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, కౌంటింగ్ సెంటర్స్ ప్రతిపాదనలు, బ్యాలెట్ బాక్సుల సంసిద్ధత, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర అంశాలపై సమీక్షించారు.

అనంతరం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి నామినేషన్లు నమోదు కాలేదన్నారు. సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, ఎంసీఎంసీ ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ బి.నవ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల నిగ్గుతేల్చాలి



మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాథం తదితరులు

పలాస: మావోయిస్టుల పేరిట ఇటీవల బొడ్డపాడులో వెలిసిన కరపత్రాల నిగ్గుతేల్చాలని, వాటిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని, అమాయకులను పోలీసు కేసుల్లో ఇరికించరాదని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.జగన్నాథం అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో ఇటీవల మావోయిస్టుల పేరిట కొన్ని కరపత్రాలు విడుదలయ్యాయి. ఈ నెల 12న బొడ్డపాడు యువజన సంఘం 69వ వార్షికోత్సవం సందర్భంగా వెలుగులోకి రావడం, అందులో స్థానిక సర్పంచితో పాటు మరి కొంతమందికి వ్యతిరేకంగా వచ్చాయి. దీంతో సమస్య కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు చేరింది. పోలీసులు కొంతమంది యువకుల సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను తీసుకెళ్లి విచారిస్తున్నారు. పోలీసుల విచారణను ఎదుర్కొంటున్న వారు మానవ హక్కుల వేదికను ఆశ్రయించారు. ఆ సంఘానికి చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాయవాది కె.వి.జగన్నాథం తన కార్యవర్గం సభ్యులతో బొడ్డపాడు గ్రామానికి సోమవారం చేరుకుని సర్పంచ్ తామాడ మదన్, యువజన సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం కాశీబుగ్గ వెళ్లి పోలీసులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బొడ్డపాడులో చాలా రోజులుగా భూసమస్యలు ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే గ్రామంలో గందరగోళం సృష్టించడానికి ఒకరిద్దరు కరపత్రాలను సృష్టించారని తెలిపారు. బొడ్డపాడు యువజన సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదన్నారు. సంఘంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాల వారున్నారని వివరించారు. పోలీసులు సమగ్రంగా విచారించి నిజమైన నిందితులను శిక్షించాలని కోరారు. సమావేశంలో బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, మానవహక్కుల వేదిక నాయకులు బీన ఢిల్లీరావు, వెంకట సురేస్, రాకేష్, యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఆమదాలవలస: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న ఏఆర్ఎస్‌లు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రం ఎదుట కాంట్రాక్టు కార్మికులు సోమవారం చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పొడవునా పని కల్పించాలని, అటెండర్, స్వీపర్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యమివ్వాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అమలుచేస్తున్న ప్రమాద, సహజ మరణ నష్టపరిహారాన్ని కాంట్రాక్టు కార్మికులకూ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు వెంకటరావు, సూర్యనారాయణ, గణపతి, సీతాలక్ష్మి, మల్లేశ్వరి, శ్రావణసంధ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల నాణ్యతలో రాజీవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాల నాణ్యతలో రాజీవద్దని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. నిజాయితీగా పనిలో జాప్యం జరిగితే అటువంటి వాటిని పరిశీలిస్తామని, నిర్లక్ష్యం వహిస్తే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న స్పెషల్ డ్రైవ్ క్రింద నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించామని, అయినప్పటికీ కొన్ని మండలాల్లో నిర్మాణాల్లో ప్రగతి కనబరచలేదన్నారు. ఆర్‌సీ, ఆర్‌ఎల్‌సీ స్థాయిలో ఉన్న గృహాలపై దృష్టి సారించాలన్నారు. అటువంటివి జిల్లాలో 10 వేలకు పైగా ఉన్నాయని, వాటిని పూర్తిచేస్తే జిల్లా ప్రగతిలో ముందుంటుందని చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎస్.గణపతిరావు, సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.